# మాతృ మమత

జయరామ్ యింట్లో అడుగు బెట్టేసరికి, గుప్పుమంటూ విషావాసన విరజిమ్మింది. ఆ గదిలోనే సోఫాలో కూచుని వూల బనీను అల్లుతూవున్న సుగుణ, ప్రక్కనే మరో సోఫాలో భాగవతం చదువుకుంటున్న శాంతమ్మ, విస్తుపోయి, అతని కేసి ఒకేసారి దృష్టి సారించారు.

జయరామ్ తూలుతూ, క్రమం తప్పి నడుస్తూ యెలాగో వచ్చి సోఫాలో కూలబడ్డాడు. సుగుణ గాభరాపడి లేచింది. ఆమె చేతిలో వున్న వూలువుండ జారి అల్లంతదూరాన పడింది. దాన్ని తీసి చేతిలో వున్న అల్లిక పనిముట్లతో సహా టేబిలు మీద పడేసి, భర్త జోడు విప్పడానికి కూచుంది, అతని మొహం లోకి అయోమయంగా చూస్తూ.

శాంతమ్మ పవిత్రమైన ఆ భాగవత పుస్తకాన్ని మూసివేసింది. కళ్ళద్దాలు ఓ సారి సద్దుకుని, కొడుకు వేపు సజల నేత్రాలతో చూస్తోంది. ఆ కళ్ళల్లో ఒక కన్నీరేకాదు-కోపమూ తొంగి చూస్తోంది.

సుగుణ కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది. పిచ్చిగా చూస్తోంది భర్త మొహంలోకి, కన్నీరు తుడుచుకోకుండానే.

"ఏయ్ యేమిటలా నా మొహంలోకి చూస్తున్నావు? ఆ..." అంటూ భార్యను కసిరాడు తడబడే మాటల్ని పట్టి పట్టి చెప్తూ.

సుగుణ మొహం దించుకుంది. ఆమెకి నోట మాట రాలేదు. జోడువిప్పుతూ వుంటే, ఆమె కన్నీరు బొట్లుగా నల్లని జోడుపైపడి, మెరుస్తోంది. జోడు. మేజోడు విప్పాక వాటిని జోడు స్టాండులో పెట్టింది జయరామ్ లేచి తూలుతూ, తన గదికేసి వెళ్ళబోయాడు. "అబ్బాయ్...." అంది శాంతమ్మ నుంచుని.

జయరామ్ ఆగాడు.

"వూ.... ఏవమ్మా" గొంతు బిగుసుకుపోయినట్టుగ అన్నాడు. ఆ మాటల్లో అంతులేని నిర్లక్ష్యం వ్యక్తమౌతోంది. అంత నిర్లక్ష్యంగా, అంత కటువుగా, కొడుకు తన ముందెప్పుడూ యిదివరకు ప్రవర్తించలేదు. ఇది కొత్త ప్రవర్తనకి నాందీ గామోను— అనుకుని బాధపడింది శాంతమ్మ. కొడుక్కి దగ్గరగా వెళ్ళింది. విస్కీవాసనని భరించలేక పోయింది. రెండడుగులు మళ్ళీ వెనక్కి వేసింది.

"ఏమిట్రా బాబూ యిది?" సౌమ్యంగా అంది తన హృదయం పగిలిపోతున్నట్లుగా బాధపడుతూ ఉంది.

"ఏది?" వెటకారంగా అన్నాడు జయరామ్:

"ఇదేన్రా! ఈ దురలవవాటు! ఈ అలవాటు నీకెట్లా అబ్బిందిరా? మన యింటా, వంటా లేదు.... నీకెందుకీ బుద్ధి.

పుట్టిందిరా? ఇది మంచిది కాదు. నామాట విని యింకెప్పుడూ తీసుకోకు" ప్రాధేయపడుతున్నట్టుగా అంది.

జయరామ్ నిర్లక్ష్యంగా నవ్వేడు. ఆ నవ్వు ఆ గదిలో ప్రతిధ్వనించింది.

"హితబోధ చేస్తున్నావా అమ్మా! మంచిదానివే! ఇది బుద్ధుడియుగం కాదు. ఇరవయ్యో శతాబ్దం...అణుయుగం, పాత ఆచారాలతో, పాత సాంప్రదాయాలతో, జీవిత మాధుర్యాన్ని దూరంగావుంచే ప్రయత్నాలు చెయ్యడానికి వీల్లేదమ్మా! అది నాగరికతకే అవమానం... ఈ వేళ ఏదో పొరపాటున చెప్పావు.... తల్లివని ఊరుకుంటున్నాను. ఇంకెప్పుడూ ఇటువంటి ప్రయత్నం చెయ్యకు. విన్నావుగా" అన్నాడు పట్టి పట్టి మాట్లాడుతూ.

ఛెళ్ళున లెంపకాయ కొట్టినట్లనిపించింది శాంతిమ్మకి. ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడు! వీడు ఎందుకిలా మారాడు? ఇంతకుముందు వాడిలోలేని ఈ విపరీత ప్రవర్తన, ఇప్పుడు రావడమేమిటి? అందుకు హేతువేదో ఆమె ఊహకి అందలేదు అయినా; తల్లిగా తనకి కొంత బాధ్యత వుంది గాబట్టి వాడు యేం అనినా సహించాలి.

"నువ్వింతగా మారిపోయావేంరా? ఇంతకుముందు నీలో వెదికితే కనిపించని నిర్లక్ష్యం కూడా అబ్బిందేమిటి? ఈ మార్పు నీకు ప్రమోషను వచ్చాక రావడం, వింతగా ఉంది అంతస్తుకి పోవడమంటే అధః పాతాళానికి పోవడమా? నాకేం అర్థంకాలేదు. ఇదేం మంచిదికాదు. ఈ అలవాటుతో

బాగుపడిన వాళ్ళు ఒక్కరూ కనిపించరు. ఇల్లూ, ఒళ్ళూ కూడా గుల్ల చేసుకొని, చివరికి పశ్చాత్తాపంతో దహించుకు పోయేవాళ్ళే అంతాను. మానేయరా ఈ అలవాటు....మన వంశ గౌరవం కాపాడ్డానికి మానేయ్...."

"వంశ గౌరవం...." జయరామ్ మళ్ళీ నవ్వేడు. "ఈ అమ్మమ్మ కబుర్లు యింక కట్టి పెట్టమ్మా!" అంటూ ముందుకు పోబోయాడు.

శాంతమ్మకి ఆవేదన ఆగిందికాదు. ఆమె నయనాల నుండి అశ్రుధారలు చెక్కిళ్ళమీంచి జారిపోతున్నాయి. సుగుణ ప్రక్కకి మొహం తిప్పుకుని విలపిస్తోంది.

"అబ్బాయ్....నా కళ్ళముందే నువ్విలా తయారవ్వడం నేను సహించలేనురా. నేను నీ తల్లిని....కన్నతల్లిని... నీ పతనాన్ని కళ్ళారా చూడలేను" అంది ఆవేదన పూరితంగా.

జయరామ్ తల్లి కేసి తీక్షణంగా చూశాడు. అప్పటికే ఎఱ్ఱబడిన కళ్ళు, మరింత ఎరుపుతనాన్ని పుంజుకున్నాయి. అతని నిషామైకం అతనిలోని విచక్షణా జ్ఞానాన్ని చంపేసింది.

"అబ్బే! అంత బాధ యెందుకమ్మా? నువ్వంతసహించ లేకుండా వుంటే, నాకు దూరమైతే పోయేదిగా: ఎందుకీ గొడవంతా!"

"బాబూ..." అదిరిపోయింది శాంతమ్మ హృదయం.

"ఔనమ్మా: హాయిగా మన వూరు వెళ్ళి వుండు...." అంటూ "కమాన్ సుగుణా!" అని, తన గదిలోకి వెళ్ళి పోయాడు.

"అత్తయ్యా!" బావురుమంది సుగుణ.

కొడుకు మాటలకు కర్రగట్టి పోయిన శాంతమ్మ ఒక నిట్టూర్పు విడిచి తేరుకుంది. కళ్ళను చీరచెంగుతో ఒత్తుకుంటూ, కోడలితల, ఆప్యాయంగా నిమిరింది

"వెళ్ళమ్మా సుగుణా! వీడిలా తయారవ్వడం, మన దురదృష్టం. ఎప్పటికయినా వాడిలో పశ్చాత్తాపం కలిగి, మార్పు వస్తుందనే ఆశించుదాం...." అంది రుద్ధస్వరంతో.

సుగుణ కళ్ళు ఒత్తుకుంటూ, బితుకు బితుగ్గా భర్తవున్న గదిలోకి వెళ్ళిపోయింది.

శాంతమ్మ, సోఫాలో కూలబడి పోయింది. ఆమె దృష్టి పవిత్రమైన భాగవతపుస్తకం మీదే కేంద్రీకరించివుంది. "భగవాన్ ఏమిటీపరీక్ష? ఎన్నడూ పల్లెత్తుమాట కూడా అనని కొడుకు, యీనాడు నన్ను తనకి దూరంగా పొమ్మంటున్నాడూ అంటే, యేమనుకోవాలి? ఎప్పుడూలేని యీ అలవాటుకి వాడు దాసోహమనడ మేమిటి? పరిస్థితుల ప్రాభవమేనా? వాడి శ్రేయస్సుకి చెబితే యెదురు తిరిగాడే! నా మాట కేం? సుగుణ యెంతగా బాధపడుతోందో పాపం! బొత్తిగా అమాయకురాలు! ఆమె జీవితంలోనే యిటువంటి తుఫాను సృష్టించాలా?"... అంటూ మనసులో వాపోయింది.

ఆ రాత్రి శాంతమ్మకి నిద్రపట్టలేదు. కొడుకు అన్న మాటలు, చెవుల్లో గింగురుపెడుతూ, మరీ మనః క్లేశాన్ని కలిగించాయి. ఇన్నాళ్ళూ వాడలా తిరిగినా భరించింది. ఈ రోజు

తనని నిర్లక్ష్యంచేసి మాట్లాడినా, సహించింది. కాని ... కాని ... పోమ్మంటుంటే యింక యెట్లా వుండగలదు? ఇంక యెంత సహనం తనలో వుంటుంది? దేనికి అయినా, ఒక హద్దుండాలా?.... అని కర్తవ్యం కోసం తలపోసింది. అంతలోనే, అంతరాత్మ హెచ్చరించింది. 'ఎంతయినా నువ్వు తల్లివి అతడిని మంచిమార్గాన పెట్టాల్సిన బాధ్యతనీది. నువ్వు దూరంగా పోతే, మరీ విచ్చలవిడిగా ప్రవర్తిస్తాడు. మరీ పతన మౌతాడు.'

అంతరాత్మ హెచ్చరికను కాదనలేక పోయింది శాంతమ్మ. అందుకే తొందరపడి వెళ్ళిపోలేదు. అనంతమైన ఆమె హృదయంలో ఆ మాతృ హృదయంలో, ఆ వేదనను దాచుకుంది. కన్నీరు తుడుచుకుంది.

*　　*　　*

రోజులు నిర్విరామంగా గడుస్తున్నాయి. జయరామ్ త్రాగుడికి దూరం కాలేకపోయాడు. రోజూ రాత్రి, మైకంతో వస్తున్నాడు. ఇప్పుడిప్పుడు కాస్త నిలద్రొక్కుకుంటున్నాడు. రోజూ శాంతమ్మ కొడుకుని వారించాలని ప్రయత్నించి, భంగపడుతోంది. సుగుణ పరిస్థితికూడా అలాగేవుంది. ఒక్కోరాత్రి సుగుణమీద చెయ్యిచేసుకుంటున్నాడు కూడా. శాంతమ్మ ఏమీ చెయ్యలేని అయోమయ స్థితిలో కొడుకుని గట్టిగా కూకలేసిన రోజు మళ్ళీ అన్నాడు జయరామ్ "నువ్వు యీ ఇంటి నుండి వెళ్తేనేగాని మాకు శాంతి వుండదమ్మా! ఆ రోజు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నాను" అని.

శాంతమ్మ బాధపడలేదు. కన్నీరు కార్చలేదు. ఎందుకంటె, బాధపడి బాధపడి ఆమె హృదయం రాయిగా మారింది. ఏడ్చిఏడ్చి కన్నీరు యింకిపోయింది. ఇంక ఆమెకు అక్కడ వుండాలనిపించలేదు. తమ వూరు వెళ్ళిపోవాలని నిశ్చయించుకుంది. తన జీవితం గడిచిపోవడానికి తగినంత ఆస్తి వుంది. ఫరవాలేదనుకుంది. మరుచటిరోజు కోడలితో అంది.

“అమ్మా సుగుణా! రోజూ వింటున్నావుగా—సహిస్తూ వస్తున్నాను. తల్లిగా, వాడిమాటలు ఎంత కటువుగా వున్నా, మనసులో దాచుకుంటున్నాను. కాని సహనానికి కూడా ఒక హద్దు వుంటుందా మరి! ‘ఛీ’ ‘ఛీ’ అంటుంటే నాకు పట్టనట్టు ఎంతకాలం వుంటాను? అందుకే నేను వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నానమ్మా! ఇన్నాళ్ళూ నేను ఇక్కడ వున్నది వాడిమాటకేంగానీ, నువ్వు ఏమైపోతావోనని వున్నాను. ఇక ఆ బాధ్యత నీదే! నీ ధైర్యానికి ఇదొక పరీక్షా సమయం. ఈ రోజే వెళ్ళిపోతున్నానమ్మా” రుద్ధ స్వరంబొంగురుపోయింది.

సుగుణ చలించిపోయింది. “అత్తయ్యా” భయాందోళనలతో బావురుమంది. “మీరు వెళ్ళిపోతే ఎలా అత్తయ్యా? నా గతేం కాను? ఇన్నాళ్ళూ మీరు దగ్గరున్నారనే ధైర్యం నాలోని ఆ వేదనను మరిపించింది. ఆయన్ని అదుపు పెట్టేవాళ్ళే ఇంకెవరూ లేకపోతే, యింకేం జరగనున్నదో ఎవరికి తెలుసు? నాకు ఎందుకో భయంగా వుందత్తయ్యా!”

శాంతమ్మ క్షణం మౌనం తర్వాత నిర్లిప్తంగా నవ్వింది. ఆ నవ్వులో ఎంత బాధఉంది. "నేను ఉండి మాత్రం వాణ్ని యే విధంగా అదుపులో పెడుతున్నాను సుగుణా? అదంతా వట్టిభ్రమ తల్లీ. నేను దూరంగా వెళ్ళిపోయినా, వాడిలో మార్పు వస్తుందేమోననే ఆశ నాలో ఎక్కడో మిణుకు మిణుకు మంటోంది. అదీ ప్రయత్నించి చూద్దాం. నువ్వు ధైర్యంగా వుండు. భగవంతుడే వున్నాడు" అంటూ ఆమెను ఓదార్చింది. సుగుణ కేవలం ఏడవడం తప్పించి, మరేమీ మాట్లాడలేకపోయింది. ఆమెలో ఏవేవో భావాలు తలెత్తాయి.

ఆ రోజు బండికే వెళ్ళిపోయింది శాంతమ్మ. ఆ రాత్రి పదిగంటలు దాటాక, జయరామ్ యింటికి వచ్చాడు. పరిస్థితిలో మార్పేమీ లేదు. సుగుణ గుండెలు విపరీతంగా కొట్టుకున్నాయి. ఆమెకి యేడుపొస్తోంది జయరామ్ యిల్లంతా ఓ సారి కలయజూశాడు తల్లి కనిపించలేదు!

"అమ్మేది?"

"ఈ వేళ బండికి వెళ్ళిపోయిందండీ" బితుకు బితుకుమంటూ జవాబిచ్చింది.

జయరామ్ మురిసిపోతూ నవ్వేడు. "పీడ విరగడయ్యింది." సోఫాలో కూలబడ్డాడు. సుగుణజోడు విప్పడానికి కూచుంది. జయరామ్ వుత్సాహంతో సిగరెట్ ముట్టించి, జేబునుండి బ్రాంది బుడ్డితీసి టీపాయ్‌మీద పెట్టాడు.

సుగుణకి గుండె ఆగినంత పనయ్యింది. కాని యేం చెయ్యగలదు. తను అతని భార్య: ఆయన తాళిగట్టి తనని ఒక పరిధిలో వుండమని ఆజ్ఞయిచ్చిన భర్త: ఆమె కళ్ళు నీటిమయ మయ్యాయి. ఆ నీటి పొరగుండా, బ్రాంది సీసా రంగు రంగులుగా అగుపిస్తోంది వెక్కిరించినట్టుగా.

*  *  *

రోజులు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. జయరామ్‌లో మార్పు రాలేదు. సుగుణ యెప్పటికప్పుడు అత్తయ్యకి విషయాలు తెలియజేస్తోంది. శాంతమ్మ మాత్రం, యింకా ఆశతోనే జవాబులు రాస్తోంది.

ఒక రోజు సుగుణ అన్నయ్య రఘువచ్చి ఇక్కడి పరిస్థితిని పసిగట్టాడు అతనికి యెంతో బాధనిపించింది. చెల్లెల్ని తనతో తీసుకు వెళ్తానన్నాడు. జయరామ్ ఆటంక పర్చలేదు. కాని సుగుణ రానంది. తనూ వెళ్ళిపోతే, భర్త యే విధంగా తయారవుతాడోనన్న ఆందోళన ఆమెలో చెలరేగింది. అయినా రఘు తన పట్టుదల వదల్లేదు. చెల్లెల్ని తనతో తీసుకు వెళ్ళాడు.

భార్య వెళ్ళాక, ఒంటరివాడైన జయరామ్ ఒంటరితనాన్ని అనుభవించలేదు అతనికి తోడుగా బుడ్డేవున్నందుకు ఆనందించాడు. క్రమంగా అతని అలవాటు హద్దులు మీరింది. అతనిది నిషా ప్రపంచమయ్యింది. మరి మరీ దిగజారిపోయాడు. ఒకొక్కరోజు ఆఫీసుకి వెళ్ళడమే మానుకునేవాడు. ఒక బాధ్య

తాయుతమైన వుద్యోగ నిర్వహణలో లోపం ఏర్పడింది. అధికారులు అతని ప్రవర్తనను కూలంకషంగా పరిశీలించి యిక లాభం లేదనుకొని వుద్యోగం నుండి తొలగిస్తూ వుత్తర్వు జారీచేశారు. ఆ వుత్తర్వును అతనికి అందచేశారు.

జయరామ్ ఆ ఆర్డరును పదిసార్లు చదివాడు: ఎన్ని సార్లు చదివినా అందులోని భాష ఒకేలా కనిపించింది. కర్ర గట్టి పోయాడు. కళ్ళు తిరిగాయి. తను వుంటున్న ఇంటికప్పు విరిగి మీదపడినట్లయింది. బ్రాందీసీసా ముక్క ముక్కలై అందులో ద్రవపదార్థం రక్తంలా ప్రవహించినట్టయ్యింది. గుండెలు జోరుగా కొట్టుకున్నాయి. తల్లీ, భార్యా దీనంగా తనవేపు చూస్తున్నట్టూ, బంధువులూ, స్నేహితులూ పరిహాసంగా నవ్వుతున్నట్టూ భ్రమ కలిగింది. వణుకుతున్న చేతుల్లో ఆ కాగితం రెపరెపలాడింది. దాన్ని మడిచి, జేబులో పెట్టాడు. మొహం స్వేదంతో నిండింది. ఏమిటిలా జరిగింది? మొన్న మొన్ననే ప్రమోషను దొరికిందన్న ఆనందంతో అంతస్తుతో విర్రవీగాడు. అసలుకే మోసం వస్తుందని ఎప్పుడూ ఊహించలేదుకూడాను. ఇప్పుడేంచెయ్యాలి? మార్గమేది? ఎక్కడికి వెళ్ళడం?.... ఆలోచనల బరువు అధికమయ్యింది. నిషా వదిలింది పూర్తిగా. ఆ నిషా తలంపే లేకపోయింది. తల్లి దగ్గరికి వెళ్ళడమా, భార్య దగ్గరికి వెళ్ళడమా. అన్న సందిగ్ధ స్థితి ఆయనలో బాగా ఏర్పడింది. భార్య దగ్గరికి వెళ్ళి, వాళ్ళందరిచేత అవమానింపబడ్డం ఇష్టంలేక

పోయింది: తల్లి దగ్గిరికే వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. ఆ రోజే బైలుదేరాడు.

*　*　*

శాంతమ్మ ముందు గదిలో కూచుని, భాగవతం చదువుకుంటోంది. ఆమెకు మధ్యమధ్య కొడుకు గుర్తుకువస్తున్నాడు. "అమ్మా!" అన్న పిలుపు విని విస్తుపోయింది వీధిగుమ్మంకేసి చూసింది. జయరామ్ నుంచున్నాడు. తను భ్రమపడ్డం లేదు కదా! అనుకుంటూనే పుస్తకం మూసి ఆతృతగా లేచింది.

"రారా నాయనా! ఇప్పుడే అనుకుంటున్నాను - నువ్వెలా వున్నావ్?" ఆప్యాయంగా ముందుకు వచ్చింది. ఆ ముఖంలో దేవత్వం గోచరించింది.

జయరామ్ నోట మాట రాలేదు. తను హీనుడు .... దుర్మార్గుడు....కృతఘ్నుడు...తన స్వార్థంకోసం తల్లిని అవమానించి పొమ్మన్నాడు. తల్లి ఆవేదన, ఆమె కన్నీరు వూరికనే పోయిందా? తనని యీ విధంగా శిక్షించాయి. చివరికి తను తల్లి దగ్గిరికే రాక తప్పింది కాదు. ఈ తరుణంలో తల్లి తప్ప మరెవ్వరూ ఆదరించరు. అందుకే వచ్చాడు. తనని అసహ్యించుకుంటుందేమోనని ముందు శంకించాడు. కాని తల్లి ఆప్యాయత, ఆ శంకను పటాపంచలు చేసింది. మనసు శాంతకుదుటపడింది.

"అమ్మా! నన్ను క్షమించమ్మా! నీకు తీరని ద్రోహం చేశాను. అది తలచుకుంటే నాకు ఆత్మహత్య చేసుకోవాలని

పిస్తోంది." అంటూ ఆమె ముందు దీనుడిలా నుంచున్నాడు. అతని కళ్ళు జలమయ మయ్యాయి.

శాంతమ్మ చల్లగా నవ్వింది.

"క్షమించడాని కేముందిలేరా: ఇందులో యెవరు పరాయివాళ్ళు; నువ్వు నా కొడుకువు. నేను నిన్ను కన్న తల్లిని. మనకు అరమరిక లేమిటి? ఆ....సరేగాని! సుగుణను తీసుకురాలేక పోయావా? మందహాసం చేస్తూనే అంది.

జయరామ్ గట్టిగా నిశ్వాసం వదిలాడు, అంతా వివరంగా చెప్పాడు.

కొడుకు వుద్యోగం పోవడం శాంతమ్మకి క్షణం బాధ కలిగించినా ఒక విధంగా అది మంచికే వచ్చిందనుకుంది. "పోనీలేరా! జరిగిందానికి విచారించి బాధపడ్డ మెందుకు? ఇప్పుడు కర్తవ్యం యేమిటో ఆలోచించు....ఏం చెయ్యదల్చుకున్నావు?"

"వుద్యోగం కోసం హైదరాబాద్ వెళ్తున్నానమ్మా! నాకు డబ్బు కావాలి."

"అలాగేలే! కాని, అక్కడ వుద్యోగం దొరికాక కూడా. మొదటిలాగానే తయారవుతావేమో" సందేహం వెలిబుచ్చింది.

జయరామ్ సిగ్గుపడ్డాడు.

"ఆ సందేహం నువ్వు వెలిబుచ్చావంటే అందులో తప్పేమీ లేదమ్మా. కాని అదెప్పటికీ జరగదు. జీవితంలో

ఒక మంచి పాఠం నేర్చుకున్నాను కదా! అయినా యిప్పుడు ఆ అంతస్తుగల వుద్యోగం దొరకదులే: ఆనాటి జయరామ్‌ని మర్చిపో అమ్మా!" పశ్చాత్తాపంతో అన్నాడు.

శాంతమ్మ కళ్ళల్లో ఆనందాశ్రువులు దోబూచు లాడాయి.

"బాబూ! నీ గురించి నాకెప్పుడూ సదభిప్రాయమే వుందిరా! వుంటుంది కూడాను. కలకాలం నువ్వు సుఖంగా వుండి గౌరవప్రదమైన జీవితంసాగిస్తే నా కంతకంటే కావల్సిం దేముంది చెప్పు."

"అమ్మా గతంలో తప్పుగా ప్రవర్తించాను. నన్ను మంచి మార్గంలో పెట్టాలని ప్రయత్నించిన నిన్ను అవమా నించాను. ఫలితంగా ఇన్ని పరిణామాలు వచ్చాయి. నా జీవితంలో ఇంక ఇటువంటి అలవాట్లకి ఎప్పుడూ స్థాన ముండదమ్మా! నీకు మనసారా మాటిస్తున్నాను. నా మాట నమ్మమ్మా!"

శాంతమ్మ ఆనందం పట్టలేక కళ్ళు ఒత్తుకుంది.

"ఈ వాగ్దానం చాలు నాయనా! అది సర్వదా నీకు గుర్తుంటే తప్పటడుగుకి ఆస్కారం వుండదు. ఈవేళ ఉత్తరం రాస్తాను. సుగుణకి - ఇక్కడికి వచ్చేయమని: పద స్నానం చేసి భోజనం చేద్దువుగాని...." అంటూ కొడుకు చేయి పట్టు కుని లోపలకు తీసుకుపోయింది ఆ మాతృమూర్తి.

జయరామ్ కళ్ళు సిగ్గుతో చెమ్మగిల్లాయి. ఎటువంటి అమృతమూర్తిని యే విధంగా అవమానించాడు తను? అందుకు నిష్కృతి లేదు.... లేదు నిష్కృతి .... అనుకుంటూ పశ్చాత్తప్తుడై లోపలికి కదిలాడు. ఆ రోజునుంచీ అతనిది కొత్త జీవితం, అతను కొత్త జయరామ్!